నోటీసులు ఇస్తే తెల్లారే కూల్చేస్తా..

- నిబంధనల మేరకే ఫాంహౌస్
- 111 జీవో ప్రకారమే కట్టుకున్నా
- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ)/ఖైరతాబాద్ : ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో తన ఫాంహౌస్‌లేదని, ఒకవేళ హైడ్రా నోటీసులు ఇస్తే.. తెల్లారే తన ఇంటిని తానే కూల్చేస్తానని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. నిబంధనల ప్రకారమే ఫాంహౌస్ నిర్మించినట్టు తెలిపారు. 111 జీవో ప్రకారం చాలా మంది పెద్దలు భవనాలు నిర్మించుకున్నారని, అందరితో పాటు తాను కూడా నిర్మించుకున్నానని చెప్పారు. తన ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందంటూ వచ్చిన విమర్శలపై ఆయన స్పందించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గండిపేట చెరువు పైభాగాన కొత్వాల్‌గూడలో 14.14 ఎకరాల భూమిని 1999లో కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఈ భూమి తన కొడుకు రినీష్ పేరుపై ఉన్నట్టు చెప్పారు. పట్టా భూమినే కొనుగోలు చేశానని వివరించారు. అక్కడ ఇరిగేషన్ అధికారులు, కలెక్టర్ చెప్పిన విధంగా నిబంధనల ప్రకారమే ఇల్లు కట్టుకున్నానని, నిబంధనలకు వ్యతిరేకంగా ఉందంటే తానే కూల్చివేస్తానని, ప్రభుత్వం కూల్చాల్సిన అవసరంలేదని స్పష్టంచేశారు. చెరువుల కబ్జాను కూల్చాల్సిందేనని తేల్చిచెప్పారు. ఇప్పటివరకు తనకు ఎలాంటి నోటీసులు రాలేదని, ఒకవేళ వస్తే తెల్లారే ఇంటిని కూల్చేస్తానని చెప్పారు.

అంతా సక్రమమైతే... చుట్టూ నీళ్లెందుకు?!

- ఎమ్మెల్సీ పట్నం వ్యాఖ్యలపై జనం విస్మయం
- అన్ని అనుమతులుంటే అది సక్రమమేనా?

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): చుట్టూ నీళ్లు.. మధ్యలో ఫాంహౌజ్.. ఐలాండ్‌ను తలపించేలా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి గెస్ట్‌హౌస్ అందరికీ సుపరిచితమే. అది సక్రమ నిర్మాణమేనని ఎమ్మెల్సీ ప్రకటించడం చర్చనీయాంశమైంది. జంట జలాశయాల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల్లో నిర్మాణాలు ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తున్నా కాంగ్రెస్ నేతలు బుకాయిస్తూనే ఉన్నారు. మొన్నటికి మొన్న బఫర్‌జోన్‌లో తన నిర్మాణం ఉంటే కూల్చుకోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించి ఆపై మౌనవ్రతం చేస్తున్నారు. తాజాగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తెరపైకొచ్చారు. హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న గెస్ట్‌హౌస్ దృశ్యాలు చూసి లోకమంతా నివ్వెరపోతుంటే.. ఆయన మాత్రం తాపీగా అంతా సక్రమమేనని ప్రకటించారు. అన్ని అనుమతులు ఉన్నాయని, కలెక్టర్‌తోపాటు అధికారులు చెప్పిన తర్వాతనే నిర్మించానని మంగళవారం ప్రకటించారు. మరి హైడ్రా కూల్చివేసిన పలు నిర్మాణాలకు కూడా అనుమతులు ఉన్న విషయాన్ని ఎమ్మెల్సీ గుర్తించడం లేదు. రెండు రోజుల కిందట రాయదుర్గంలో కట్టుబట్టలతో మూడు కుటుంబాలను నిర్బంధించి కూల్చివేసిన ఇండ్లు కొన్ని దశాబ్దాలుగా ఆస్తి పన్ను, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. అయినప్పటికీ నిర్దాక్షిణ్యంగా అధికారులు కూల్చివేతలకు పాల్పడ్డారు. అనుమతులు ఉన్నాయా? పన్నులు చెల్లిస్తున్నారా? అని ఆరా తీయడం లేదు. హిమాయత్‌సాగర్‌లో పట్నం మహేందర్‌రెడ్డికి చెందిన ఫాంహౌస్ భూమి పట్టానే కావచ్చు... కానీ అది ఎఫ్‌టీఎల్‌లో ఉందనే వాస్తవం జగమెరిగిన సత్యం. అయినా ఎమ్మెల్సీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఉంటే నేనే కూల్చివేస్తానని స్పష్టం చేశారు. ఇంత జరుగుతున్నా జలమండలి అధికారులు అక్కడికి వచ్చి ఎఫ్‌టీఎల్ నిర్ధారించకపోవడం శోచనీయం.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	36.5°c	22.8°c
మెదక్	34.2°c	21.8°c
రంగారెడ్డి	34.1°c	21.3°c
వరంగల్	33.0°c	25.0°c
నిజామాబాద్	32.6°c	23.6°c
కరీంనగర్	32.0°c	25.0°c
ఖమ్మం	32.0°c	25.0°c
నల్లగొండ	31.0°c	24.2°c
హైదరాబాద్	30.0°c	23.0°c
మహబూబ్‌నగర్	30.1°c	22.3°c

రాష్ట్రంలో మరో ఆరు రోజులు వర్షాలు!

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో ఆరు రోజులపాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని తెలిపింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని, దీని ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, ములుగు, ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురువొచ్చని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లో వాతావరణం పొడిగా ఉంటుందని వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. ఉదయం ఎండగా అనిపించినా.. మధ్యాహ్నం తర్వాత వాతావరణం చల్లబడుతుందని సాయంత్రానికి వర్షం కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు. గడిచిన 24 గంటల్లో కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో అత్యధికంగా 2.22 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

హైడ్రా పేరిట రేవంత్ డ్రామా

ఎంపీ ఈటల రాజేందర్

కమలాపూర్, ఆగస్టు 27: హైడ్రా పేరిట సీఎం రేవంత్‌రెడ్డి డ్రామా ఆడుతున్నాడని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. మంగళవారం ఆయన హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో మీడియాతో మాట్లాడారు. ఎన్నడూ ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా సక్కగా పదవి చేపట్టని రేవంత్‌రెడ్డి మాయమాటలు చెప్పి ముఖ్యమంత్రి అయ్యాడని ఆరోపించారు. 'అబద్ధాలాడే వాళ్లనే ప్రజలు ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటరు. ప్రభుత్వం వస్తది, నిజం చెప్పేవాళ్లని ఎన్నుకోరు' అని రేవంత్‌రెడ్డి అమెరికాలో చెప్పాడని, ఇప్పుడే అదే నిజమైందని అన్నారు. ఎన్నికల ముందు 65 లక్షల మంది రైతులు ఉన్నారని, రూ.48 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పుడు 45 లక్షల మంది రైతులే ఉన్నారని, 34వేల కోట్లు సరిపోతుందని చెప్పి, చివరకు రూ. 17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశాడని దుయ్యబట్టారు.

జన్వాడలో హైడ్రామా!

మొదటిపేజీ తరువాయి...

గుమిగూడిన ప్రజలను పంపించేశారు. బుల్కాపూర్ నుంచి గండిపేట వరకు ఉన్న ప్రాంతాల్లో వర్షం పడినపుడు వరదనీరు గండిపేట జలాశయంలోకి వెళుతుంది. వరదనీరు వెళ్లే నాలాకే బుల్కాపూర్ నాలా అని పేరు. శంకర్‌పల్లి పరిధిలోని బుల్కాపూర్ నుంచి జన్వాడ, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, ఇబ్రహీంబాగ్ చెరువుమీదుగా బుల్కాపూర్ నాలా గండిపేట వరకు ఉంటుంది. గండిపేటలో సర్‌ప్లస్ వాటర్ హుస్సేన్‌సాగర్‌లోకి మళ్లించేలా గండిపేట నుంచి పేక్‌పేట, టోలిచౌకి, ఎండీ లైన్స్, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్ మీదుగా హుస్సేన్‌సాగర్ వరకు కూడా బుల్కాపూర్ నాలా ఉంది. బుల్కాపూర్ గ్రామం నుంచి గండిపేట వరకు ఉన్న బుల్కాపూర్ నాలా ఒక్కోచోట ఒకో రీతిలో విస్తరించి ఉంది. ఆ మేరకు ఆయా గ్రామాల నక్షాలో బుల్కాపూర్ నాలా ఎంత వెడల్పులో ఉందనేది స్పష్టంగా ఉంది. జన్వాడ మీదుగా వెళుతున్న బుల్కాపూర్ నాలాను అనుసరించే ప్రదీప్‌రెడ్డికి చెందిన ఫాంహౌస్ ఉంది. గండిపేట ఎఫ్‌టీఎల్ నుంచి జన్వాడ రెండు కిలోమీటర్లపైగా దూరంలో ఉంటుంది. కానీ ఒక సెక్షన్ మీడియా గండిపేట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో జన్వాడ ఫాంహౌస్ ఉందని దుష్ప్రచారం చేస్తుంది.

జన్వాడలో బుల్కాపూర్ నాలా సర్వే చేస్తున్న అధికారులు

నిబంధనలు ఇవి

సాధారణంగా నాలా, సాగునీటి కాల్వలకు రెండు వైపులా బఫర్‌జోన్ ఉంటుంది. నిబంధనల ప్రకారం పది మీటర్లలోపు విస్తీర్ణంలో ఉన్న నాలా, కాల్వలకు బఫర్‌జోన్ రెండు మీటర్లుగా ఉంది. అదేవిధంగా పది మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో (ఎంతైనా సరే) ఉంటే బఫర్‌జోన్ తొమ్మిది మీటర్లుగా నిర్ధారించాలి. బుల్కాపూర్ నాలా సగటున పది మీటర్ల కంటే ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో దాని బఫర్‌జోన్ గరిష్ఠంగా తొమ్మిది మీటర్లుగా ఉంటుంది. కాగా జన్వాడలోని గెస్ట్‌హౌస్‌కు సంబంధించి ఒక ఉన్నతాధికారి మాట్లాడుతూ కేవలం గేటు, ముందు ఉన్న ప్రహరీ మాత్రమే బఫర్‌జోన్ పరిధిలోకి వచ్చే అవకాశముంది తప్ప అందులోని భవనం చాలా దూరంలో ఉన్నదని చెప్పారు.

అక్రమ బిల్డర్ల ఆస్తులు జప్తు చేయండి

- బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి
- పేదవాళ్లకు ప్రభుత్వం భూమి లేదా ఇందిరమ్మ ఇల్లు
- హైడ్రాపై సీఎంకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): అక్రమ కట్టడాల బిల్డర్స్ ఆస్తులు జప్తు చేసి బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ విజ్ఞప్తి చేశారు. హైడ్రా పనితీరుపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పలు సూచనలు, సలహాలు చేశారు. పేదవారి ఇళ్లు కూల్చినప్పుడు వారికి ప్రభుత్వం భూమి ఇవ్వాలని లేదా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరింది. బిల్డర్లతో కుమ్మక్కై ఇష్టారీతిన రిజిస్ట్రేషన్లు, లే అవుట్ పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువుల నుంచి కూల్చిన కట్టడాల వ్యర్థాలను తీసి, చుట్టూ కంచె వేసి, కాలనీ వాసులకు చెరువును అప్పగించాలని కోరారు. హైడ్రా వంటి సంస్థలు జిల్లాల్లోనూ కావాలని ప్రజలు కోరుతున్నారని, రాష్ట్రమంతటికీ వర్తించేలా ఒక చట్టం చేసి ప్రభుత్వ భూములు కాపాడటానికి సంస్థను ఏర్పాటు చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ విజ్ఞప్తి చేశారు.

కోట్ల విలువైన భూపందేరంపై పిల్

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ గచ్చిబౌలిలో పర్యాటక శాఖ రూ.కోట్ల విలువైన 3 ఎకరాల భూమిని సప్తర్షి హోటల్‌కు కట్టబెట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో హైకోర్టు మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం ఆదేశించింది. గచ్చిబౌలిలో సర్వే నంబర్ 91లో ఉన్న ఈ భూమిని 2010లో సప్తర్షి హోటల్‌కు అప్పగించిన వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని బక్క జడ్సన్ వేసిన పిటిషన్‌పై విచారణను 4వారాలకు వాయిదా వేసింది.

వాస్తవాలను దాచి పిల్ వేయడంపై హైకోర్టు ఆగ్రహం

కేసును సివిల్ కోర్టులోనే తేల్చుకోవాలని స్పష్టీకరణ

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సంజీవరెడ్డినగర్‌లోని బీకేగూడలో 102/3, 102/2 సర్వే నంబర్లలో ఉన్న 1,537 చదరపు గజాల క్రీడా మైదానాన్ని పరిక్షించడంలో అధికారులు విఫలమయ్యారంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు డిస్మిస్ చేసింది. ఆ క్రీడా మైదానాన్ని పరిరక్షించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ గతంలో ఓ పిటిషన్‌ను వేసి వాపసు తీసుకున్న వాస్తవాన్ని గుట్టుగా ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ వివాదాన్ని సివిల్ కోర్టులోనే తేల్చుకోవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం స్పష్టం చేసింది.

బదిలీల్లో 89 చోట్ల తప్పులు

సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): బదిలీలు, ప్రమోషన్లలో 89 చోట్ల తప్పులు జరిగాయని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీజీడబ్ల్యూఆర్‌ఈఐఎస్) కార్యదర్శి అలుగు వర్షిణి తెలిపారు. వాటిని కూడా పరిష్కరిస్తున్నట్టు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల్లో వారంలో రెండుసార్లు మెడిటేషన్ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. తరగతుల నిర్వహణకు బ్రహ్మకుమారీస్ సంస్థతో సొసైటీ అవగాహన కుదుర్చుకుందని, గురుకుల టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని గురుకుల విద్యార్థులకు అందించేందుకు కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్ సంస్థల వలంటీర్లతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

వెబ్‌సైట్‌లో 'అసిస్టెంట్ సర్జన్' అభ్యర్థుల జాబితా

హైదరాబాద్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): పశు సంవర్ధక శాఖలో అసిస్టెంట్ సర్జన్(క్లాస్-ఏ, క్లాస్-బీ) పోస్టులకు ఎంపికైన 171మంది అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటనలో తెలిపింది. ఎంపికైన అభ్యర్థుల జాబితా, వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

31న 'టీపీఎస్‌సీ' వెరిఫికేషన్

హైదరాబాద్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): గ్రౌండ్ వాటర్ శాఖలో నాన్ గెజిటెడ్ క్యాటగిరీ సాధారణ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను 31న నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయంలో ఉదయం 10.30కు నిర్వహించనున్నట్టు కార్యదర్శి నవీన్ నికోలాస్ ప్రకటనలో తెలిపారు. 30, 31న వెబ్ ఆప్షన్స్ లింకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టినట్టు తెలిపారు. అభ్యర్థుల చెక్‌లిస్ట్, అటెస్టెడ్ ఫామ్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, దాని ఆధారంగా ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

నేడు ఆర్‌అండ్‌బీపై సీఎం సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): రోడ్లు, భవనాల శాఖకు చెందిన వివిధ ప్రాజక్టులు, అభివృద్ధి పనులపై బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. రీజనల్ రింగురోడ్డు భూసేకరణ పురోగతిపై అధికారులతో చర్చించనున్నారు. ఇందులో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు ఉన్నతాధికారులు పాల్గొంటారు.

ఐఐఐటీహెచ్‌తో పోలీసు అకాడమీ ఎంవోయూ

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): మారుతున్న సాంకేతిక పరిస్థితులను క్షుణ్ణంగా పోలీసులకు వివరించడంతోపాటు, సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలను నేర్పించడానికి తెలంగాణ పోలీసు అకాడమీ, ఐఐఐటీ హైదరాబాద్‌తో మంగళవారం ఒప్పందం చేసుకుంది. పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాషబిస్ట్, ఐఐఐటీ ప్రతినిధులతో కలిసి ఎంవోయూపై సంతకం చేశారు.

ప్రైవేటు టీచర్లకు పురస్కారాలు ఇవ్వాలి

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రైవేటు టీచర్లకు పురస్కారాలు ఇవ్వాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ప్రజాభవన్‌లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని 11 వేల పైచిలుకు ప్రైవేటు స్కూళ్లలో 2.5 లక్షల మంది టీచర్లు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ టీచర్లకు న్యాయం జరిగేటట్టు చూడాలని విద్యాశాఖ కమిషనర్ నరసింహారెడ్డికి ఫోన్‌లో విన్నవించినట్టు పేర్కొన్నారు.

డీఎస్సీ 'స్పోర్ట్స్' సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేయాలి

హైదరాబాద్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): స్పోర్ట్స్ కోటాలో డీఎస్సీ-2024 పరీక్షకు జిల్లాలవారీగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు క్రీడా ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మంగళవారం ప్రకటనలో సూచించారు. నేటి నుంచి 2 వరకు అఫిషియల్ వెబ్‌సైట్ ద్వారా స్పోర్ట్స్ సర్టిఫికెట్లను సమర్పించాలని కోరారు.

5లోగా 'మేనేజ్‌మెంట్' వివరాలు వెల్లడించండి

బీఈ/బీటెక్ కోర్సుల్లో ఈ ఏడాది మేనేజ్‌మెంట్ కోటా సీట్ల వివరాలను 5లోగా వెల్లడించాలని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీ యాజమన్యాలకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ సూచించారు. అప్‌లోడ్ చేసిన వివరాలను ఫ్రీజ్ చేయడానికి వచ్చే నెల 5 చివరి గడువు అని తెలిపారు. రూ. వెయ్యి అపరాధ రుసుముతో 10 వరకు అవకాశం కల్పించినట్టు వెల్లడించారు. www.tgche.ac.in ను చూడాలని కోరారు.

అక్బర్ వార్నింగ్.. హైడ్రా వెనక్కి!

- విద్యాసంవత్సరం మధ్యలో ఆ భవనాల జోలికి వెళ్లం
- విద్యార్థులు నష్టపోవద్దనే నిర్ణయమని హైడ్రా ప్రకటన
- ఎంఐఎంకు తలొగ్గింది అని ప్రజలలో విస్తృతంగా చర్చ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): విద్యాసంవత్సరం మధ్యలో విద్యాలయాల అక్రమ భవనాలను కూల్చబోమని హైడ్రా ప్రకటించింది. ఎంఐఎం శాసనసభపక్ష నేత అక్బరుద్దీన్ ఇచ్చిన వార్నింగ్‌తోనే హైడ్రా తోకముడిచిందని సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. నగరంలో కూల్చివేతలతో హైడ్రా చేసిన హడావిడి అంతా హైడ్రామా అంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తూనే ఉన్నాయి. హైడ్రాకు దమ్ముంటే ఓవైసీ సోదరులు సల్కం చెరువులో నిర్మించిన ఫాతిమా విద్యాసంస్థల భవనాలను కూల్చాలని సోషల్ మీడియా, పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు, మీడియా గొంతెత్తింది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి ఎంఐఎం పార్టీ నేతల భవనాలను కూల్చేస్తారా? లేదా?అంటూ రెండు మూడు రోజులుగా సోషల్‌మీడియాలో ట్రెండింగ్ అయింది. అక్బరుద్దీన్ తనపై కాల్పులు జరిపినా ఒప్పుకుంటా కానీ విద్యాసంస్థలను ముట్టుకోవద్దని హెచ్చరించారు. ఒకవేళ కూల్చితే 40వేల మంది విద్యార్థులు ప్రభుత్వంపై తిరగబడుతారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నగరవాసుల్లో వ్యక్తమైంది. కానీ కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా హైడ్రా విద్యాసంవత్సరం మధ్యలో ఆ భవనాలను ముట్టుకోబోమని ప్రకటించింది. అక్బర్‌ద్దీన్ పవర్‌పుల్ వార్నింగ్‌కు ప్రభుత్వం వణికిపోతూ వెనుకడుగు వేసిందనే చర్చ మొదలైంది.

విద్యార్థులు నష్టపోవద్దనే !

విద్యార్థులు నష్టపోవద్దనే విద్యాసంవత్సరం పూర్తయిన తరువాతనే చర్యలకు ఉపక్రమిస్తామని హైడ్రా అధికారులు తెలిపారు. హైడ్రాకు వస్తున్న ఫిర్యాదులపై ఆయా శాఖలు సంబంధిత స్థలాలకు వెళ్లి పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఒక సల్కం చెరువుకే కాకుండా విద్యాసంస్థలకు సంబంధించి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి విషయంలో ఇదే విధానం కొనసాగిస్తామని కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, ప్రభుత్వ స్థలాలలో భవనాలు నిర్మించిన యజమాన్యాలు స్వచ్ఛందంగా కూల్చివేయాలని సూచించారు.

ఖమ్మం వెలుగుమట్లలో నిర్మాణాల తొలగింపును అడ్డుకుంటున్న నిరుపేదలు

పేదల గుడిసెల తొలగింపులో ఉద్రిక్తత

- పట్టా భూములంటూ కూల్చడానికొచ్చిన పోలీసులు
- రేకుల షెడ్ల కూల్చివేతలను అడ్డుకున్న నిరుపేదలు

రఘునాథపాలెం, ఆగస్టు 27: ఖమ్మం అర్బన్ పరిధిలోని వెలుగుమట్లలో పేదలు వేసుకున్న రేకుల షెడ్లు, గుడిసెల తొలగింపు ఉద్రిక్తంగా మారింది. సర్వే నంబర్ 148, 149లో నిరుపేదలు నిర్మించుకున్న రేకుల షెడ్లను తొలగించేందుకు పోలీసులు జేసీబీలతో రంగప్రవేశం చేశారు. విషయం తెలుసుకున్న పేదలు జేసీబీలకు అడ్డంగా నిల్చొని కూల్చివేతలను నిలువరించారు. ఏసీపీ రమణమూర్తి, పలువురు సీఐలు మైక్ ద్వారా హెచ్చరికలు జారీ చేసినా ఏమాత్రమూ తగ్గలేదు. ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చేస్తారని నిలదీశారు. పట్టా భూములను ఆక్రమించి షెడ్లు నిర్మించడం సరికాదని, షెడ్లు వేయించిన నాయకులకు రెండు నెలలుగా తొలగించాలని చెప్పిన విషయాన్ని ఏసీపీ రమణమూర్తి మైక్ ద్వారా పేదల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన పేదలు.. తమకు రెండు రోజుల గడువు కావాలని, స్వచ్ఛందంగా షెడ్లను తొలగిస్తామని ఏసీపీని వేడుకున్నారు. దీనికి నిరాకరించిన పోలీసులు.. మరోమారు యంత్రాలతో రేకుల షెడ్లను కూల్చివేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. పోలీసుల ప్రయత్నం విఫలం కావడంతో పట్టా భూమి యజమానులు 100 మందికి పైగా రంగంలోకి దించారు. వారంతా మద్యం మత్తులో అక్కడున్న పేదలను భయభ్రాంతులకు గురిచేశారు. ఇదంతా పోలీసుల కండ్లముందే జరుగుతున్నా వారు ప్రేక్షక పాత్ర పోషించారు.

భూదాన్ భూమి పేరుతో కొందరు వ్యక్తులు తమ దగ్గర రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు డబ్బులు తీసుకున్నారని, దగ్గరుండి మరీ 100 గజాల చొప్పున జాగా చూపించి షెడ్లు వేయించారని నిరుపేదలు వాపోయారు. తీరా చూస్తే తాము గుడిసెలు వేసుకున్న భూమి పట్టా అని తేలడంతో మోసపోయామని గుండెలు బాదుకుంటూ రోదించారు.

కూల్చివేతలతో కాంగ్రెస్ హైడ్రామా

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఆగస్టు 27 : కాంగ్రెస్ ప్రభుత్వం తన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు హైడ్రా పేరిట హైడ్రామా అడుతున్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, హైడ్రా పేరిట పేదలను ఇబ్బందులకు గురిచేస్తూ విధ్వంసాన్ని సృష్టిస్తుందని ఆరోపించారు. పంట రుణాల మాఫీ, సంక్షేమ పథకాలను మరిచిపోయేందుకు హైడ్రా పేరిట నాటకాన్ని ప్రారంభించిందని విమర్శించారు. ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని, ప్రజలు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, విష జ్వరాలతో బాధపడుతున్నారని, దవాఖానలకు పోతే అక్కడ సరైన వైద్య సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయని విమర్శించారు.

ఎంజీబీఎస్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

మోగిన ఆర్టీసీ కార్మికుల రణభేరి

- యాజమాన్యం, సర్కారు నిర్లక్ష్యంపై పోరుబాట
- నల్లబ్యాడ్జీలతో నిరసనలు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): యాజమాన్య అలసత్వం, సర్కారు నిర్లక్ష్యంపై ఆర్టీసీ కార్మికులు పోరుబాట పట్టారు. ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు మంగళవారం అన్ని ఆర్టీసీ డిపోలు, యూనిట్లలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, రెండు వేతన సవరణలను అమలు చేస్తామని, యూనియన్ల కార్యకలాపాలను పునరుద్ధరిస్తామని, సంస్థను విస్తరిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో హామీలు ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని కార్మికులంతా ఆగ్రహంతో ఉన్నారు. 2013 వేతన సవరణ బకాయిలు కేవలం డ్రైవర్లకే చెల్లించి ఆరు నెలలు గడిచినా మిగతా ఉద్యోగులకు చెల్లించకుండా జాప్యం చ